క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వినతి

కట్టంగూర్ : మండలంలోని చెరువుఅన్నారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే వారికి అవకాశం కల్పించాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్ రావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షుడు గద్దపాటి సుధాకర్ మాట్లాడుతూ చెరువు అన్నారం గ్రామానికి మొదటి విడతలో 20ఇళ్లు మంజూరు కాగా 9మంది కట్టుకోవడానికి సిద్ధంగా లేరని తెలిపారు. వారి స్థానంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంట మల్లేశ్ తదితరులున్నారు.

సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా రాజశేఖర్

కనగల్ : యూత్ కాంగ్రెస్ నల్లగొండ నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గా మండల పరిధిలోని దోరేపల్లి గ్రామానికి చెందిన బక్క రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీఏ నంబర్ కూసుకుంట్ల రాజిరెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

చండూరు : వెల్మకన్నె ఫీడర్‌ఛానల్ పనులు ప్రారంభించి పూర్తిచేయించాలని కోరుతూ సామాజికక ఉద్యమకారుడు కొమ్ము గణేశ్ శనివారం చండూరులో కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ ఫీడర్ ఛానల్ పూర్తి చేస్తే మండలంలోని కొండాపురం, పుల్లెంల, బోడంగిపర్తి గ్రామాల్లో వందల ఎకరాల భూమికి సాగునీరు అందుతుందని తెలిపారు.సానుకూలంగా స్పందిచి చండూరు ఆర్డీఓను సందర్శించి రిపోర్టు పంపాలని ఆదేశించారు.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. శనివారం ప్రాజెక్టులోకి 1,968 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా ప్రాజెక్టు అధికారులు రెండు గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి 2,277 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠ నీటిమట్టం 645 అడుగులు కాగా ప్రస్తుతం 643.60 అడుగుల నీరు నిల్వ ఉంచి నీటి విడుదల కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు 528 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సీపేజీ, లీకేజీ, ఆవిరి రూపలో 62 క్యూసెక్కుల నీరు వృథా అవుతుంది. మూసీ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం4.09 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

జర్నలిస్టుకు కన్నీటి వీడ్కోలు



భాస్కర్ అంతిమ యాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు, జర్నలిస్టులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడకు చెందిన సీనియర్ జర్నలిస్టు దండ భాస్కర్ (52) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. శనివారం అందరిలో కలివిడిగా ఉండే భాస్కర్‌ను కడసారిగా చూసేందుకు భారీ ఎత్తున స్నేహితులు, బంధువులు, జర్నలిస్టులు తరలివచ్చి చివరి సారిగా కన్నీటి వీడ్కోలు పలికారు. ఇదిలా ఉంటే తాను మరణించిన మరోకరికి చూపు కల్పించాలనే లక్ష్యంతో జర్నలిస్టు భాస్కర్ తన నేత్రాలను డైమాండ్ నేత్రనిధికి దానం చేశారు. ఆయన మృతికి నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి ఫోనులో సంతాపం ప్రకటించారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, రంగారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర అమరేందర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భాస్కర్ కుటుంబానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి రూ.50వేలు, రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రూ.10 వేలు, శ్రీధర్ రూ.10 వేలు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు యడవల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆర్థిక సాయం అందించారు.

పట్టణ అంగడికి ఆదరణ

- ప్రకాశం బజార్‌లో ఉదయం పూట కూరగాయల విక్రయాలు
- నేరుగా విక్రయిస్తున్న రైతులు, చిరువ్యాపారులు
- సీజన్ పండ్లతో పాటు, ఆకు కూరలు విక్రయం


రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన కూరగాయలు



ఆకు కూరలు కొనుగోలు చేస్తున్న ప్రజలు


చింత చిగురు కుప్పలు పోస్తున్న వృద్ధురాలు

రామగిరి(నల్లగొండ): జిల్లా కేంద్రంలోని ప్రకాశం బజార్‌లో రోడ్డుపై ఉదయం పూట నిర్వహించే కూరగాయల విక్రమాలకు ఆదరణ లభిస్తుంది. ప్రతి రోజు ఉదయం ఆరుగంటల నుంచి తొమ్మిది గంటల వరకు కొనసాగుతుంది. పట్టణంలోని ప్రభుత్వ ప్రవేటు ఉద్యోగులు, దినసరి కార్మికులు వచ్చి కూరగాయలు కొంటున్నారు. చుట్టు పక్కల రైతులు వారు పండించిన కూరగాయలు, చిరు వ్యాపారులు ఇక్కడికి తెచ్చి విక్రయిస్తున్నారు. రోజు ఉదయం కూరగాయలు కొనుకునేవారితో రోడ్డంతా కిక్కిరిసిపోతుంది.

తాజాగా కూరగాయాలు

కొన్నేళ్లుగా ప్రతి రోజూ ఉదయం పూట కూరగాయల విక్రయిస్తున్నారు. ఇక్కడ కూరగాయలతో పాటు ఆకు కూరలు, సీజనల్ పండ్లు, నిమ్మకాలు, విక్రయిస్తుంటారు. అంతే కాకుండా రోజు వారి మార్కెట్‌లో లభించని ఆరోగ్యానికి మేలు చేసే ఆకు కూరలు చింత చిగురు, పిండి గొమ్మల కూరలాంటివి కూడా అమ్ముతున్నారు. మార్కెట్‌లో కంటే తాజా కూరగాయలు ఇక్కడ లభిస్తుండడంతో స్థానికుల నుంచి మంచి డిమాండ్ ఉంది. మార్కెట్ తెరుచుకోవడానికి ఆలస్యమవుతుండడంతో రోడ్డుపై ఏర్పాటు చేసే కూరగాయలకు డిమాండ్ భాగానే ఉంది. అంతేకాకుండా ఉద్యోగాలకు వెళ్లే వారు సమయం లేకపోవడం వల్ల ఉదయం పూట మార్కెట్‌కు వచ్చి వారికి కావాల్సిన కూరగాయలు ఇతర వస్తువులు కొంటున్నారు. దీంతో రైతులకు, చిరు వ్యాపారులకు లాభం చేకూరుతుంది.

కూరగాయలు తాజాగా ఉంటాయి



రెగ్యులర్ మార్కెట్ కంటే ఇక్కడ దొరికే కూరగాయలు తాజాగా ఉంటాయి. రైతులు స్వయంగా విక్రయిస్తున్నారు కాబట్టి రేట్లు కూడా తక్కువగా ఉంటాయి. ఉద్యోగులకు ఉదయం మాత్రమే ఖాళీ సమయం ఉంటుంది. అలాంటి వారికి ఉదయం మార్కెట్ ఉపయోగపడుతుంది.

– రాజేష్ కుమార్

రైతులకు మేలు జరుగుతుంది



మేళ్ల దుప్పలపల్లిలో వ్యవసాయ భూమి ఉంది. సంవత్సరం అంతా కూరగాయలు పండిస్తాను. మార్కెట్‌లో అమ్ముకుంటే గిట్టుబాటు ధర లభించదు. మార్కెట్‌లో అమ్ముకోవడానికి అవకాశం ఉండదు. ఉదయం పూట నేరుగా అమ్ముకోవడం వల్ల లాభం వస్తుంది. తొమ్మిది గంటల వరకు కూరగాయలు అమ్ముకుని యథావిధిగా వ్యవసాయ పనులకు వెళ్తాం.

– రవీందర్‌రెడ్డి, రైతు, మేళ్ల దుప్పలపల్లి

ఇందిరమ్మ ఇళ్లను పూర్తిచేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి


చండూరు కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కనగల్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం కనగల్ మండలంలోని తేలకంటిగూడెం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను శనివారం ఆమె పరిశీలించి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి 83 ఇండ్లు మంజూరు కాగా ఐదు ఇళ్ల పనులు చివరిదశలో ఉన్నాయని మరో 18 ఇళ్లకు స్లాబ్ పడిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ చివరిదశలో ఉన్న ఇళ్లను గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇంటి స్థలం లేని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించాలని ఆర్డీఓ అశోక్‌రెడ్డికి సూచించారు. అనంతరం కనగల్ పీహెచ్‌సీని సందర్శించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దార్ బి.పద్మ, ఎంపీడీఓ సుమలత, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, బొగరి రాంబాబు, క్రాంతి, బిళ్ల పాటి మోహన్‌రెడ్డి, నామ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోండి

చండూరు : జాతీయ కుటుంబ ప్రయోజన పథకంలో అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం చండూరులో మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయాలలో రికార్డులు పరిశీలించారు. ఎన్ఎఫ్‌బీఎస్ దరఖాస్తులపై ఆరా తీశారు. ఇప్పటి వరకు మండలం మొత్తం కలిపి 485దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వందనపు శ్రీదేవి, ఎంపీడీఓ యాదగిరి, తహసీల్దార్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ మల్లేశం, అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ

స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం తనిఖీ చేశారు. పాఠశాలను అంతా పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినులతో మాట్లాడారు. వంటల నాణ్యత, హాస్టల్ నిర్వహణ, సిబ్బంది తీరు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై వారితో మాట్లాడారు. బాగా చదువుకోవాలని, పెద్ద లక్ష్యాలు పెట్టుకొని వాటిని చేరుకునేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వందనపు శ్రీదేవి, పాఠశాల ఎస్ఓ మంజుల తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం


మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : నిత్యావసర సరుకులు, ఆహార పదార్థాలపై జీఎస్టీ పన్ను తగ్గించిన ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు శనివారం నల్లగొండలోని నేతాజీ విగ్రహం వద్ద పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరెల్లి చంద్రశేఖర్ ,బండారు ప్రసాద్, పోతెపాక లింగస్వామి, కంచర్ల విద్యాసాగర్ రెడ్డి, పకీరు మోహన్ రెడ్డి, వెంకటేశం, గడ్డం మహేష్, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమను పరిశీలించిన విద్యార్థులు


చిట్యాల : నేరడలో పవర్‌లూమ్స్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

చిట్యాల : పట్టణంలోని ఆక్స్‌ఫోర్డ్ స్కూల్ విద్యార్థులు ఒక రోజు క్షేత్ర పర్యటనలో భాగంగా శనివారం నేరడ గ్రామంలోని చేనేత పరిశ్రమను పరిశీలించారు. ఈ సందర్భంగా దూది నుంచి ధారం తయారి అనంతరం వస్త్రాలు తయారయ్యే విధానంలో పవర్‌లూమ్, మగ్గంపై చేనేత కళాకారుల పనుల తీరును విద్యార్థులు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చేనేత కళాకారుడు మిరియాల ప్రభాకర్ పత్తి వడకడం, నూలు తయారు చేయడం, కండెలు పట్టడం, బట్టు నేయటం చేసే పద్ధతులను విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని వారు విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు తరగతి బోధనతో పాటు క్షేత్ర స్థాయి పరిశీలించడం ద్వారా విజ్ఞానం పెంపొందుతుందని ఉద్దేశంతోనే ఫీల్డ్ విజిట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ స్కూల్ కరస్పాండెంట్ నరేందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పెద్ది పద్మ, ఆనంద్‌కుమార్, బిక్షంరెడ్డి, షమీమ్ ఉన్నీసా భేగం, పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది


తిప్పర్తి : ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు


నకిరేకల్ : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

తిప్పర్తి : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవప్రదమైనదని తహసీల్దార్ రామక్రిష్ణ అన్నారు. ఆయన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానోత్సవ కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 15మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నర్సింహ నాయక్, జీహెచ్ఎంలు యోగేంద్రనాథ్, అరుణశ్రీ, సుశీల, యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మర్రిగూడ : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని దామెరభీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వై.మంజులతతో పాటు ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం శాలువాతో ఘనంగా సన్మానించారు. తల్లిదండ్రుల తరువాత స్థానం గురువులదేనన్నారు. ఈ కార్యక్మరంలో ఉపాధ్యాయులు సబావత్ వెంకట్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిరేకల్ : స్థానిక మాస్టార్ మైండ్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ఉపాధ్యాయులను ఘనంగా సన్మనించారు. ఈకార్యక్రమంలో ఆపాఠశాల కరస్పాండెంట్ కనుకుంట్ల సునీత వెంకట్‌రెడ్డి, డైరెక్టర్లు చనగాని శ్రీనివాస్, అబ్బగోని జయక్రిష్ణ, ఆడపు గంగధర్, ఏఓ పాల్గొన్నారు.

చిట్యాల : మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో చిట్యాల ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని శాలువాలతో సత్కరించి, మొమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్ ఉపాధ్యాయురాలు సుశీల, హెచ్ఎంలు శ్రీధర్, యాదదయ్య, సత్తయ్య, నాగరాజు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సుధాకర్‌రెడ్డి, నాగయ్య, శ్రీనివవాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

మండలంలోని పెద్దకాపర్తి జెడ్పీహెచ్ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న దొడ్డి కైలాస్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక అవార్డును అందుకున్నాడు. దీంతో శనివారం ఆ పాఠశాల ఆవరణలలో ఆయనను ఎస్ఎంసీ మాజీ వైస్ చైర్మన్ నీలకంఠం నరేష్ ఆధ్వర్యంలో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లుకేందర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, బ్రహ్మయ్య, యశోధరారెడ్డి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


మర్రిగూడ : హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


చండూరు : రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు : ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్న రోడ్లను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆదేశించారు. శనివారం మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో ఆయన ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులతో రోడ్ల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల రోడ్లు గుంతలమయంగా మారాయన్నారు. వాటికి మరమ్మతులు చేపట్టి ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రూ.వేయ్యి కోట్లతో జరుగుతున్న ఆర్అండ్‌బీ, రూ.500కోట్లతో పంచాయతీరాజ్ రోడ్ల పనుల వేగంగా చేపట్టాలన్నారు. ప్రస్తుతం మంజూరైన నిధులు ఖర్చుచేసిన వెంటనే మరో రూ.1500కోట్లు నుంచి నిధులు మంజూరు చేయించి ప్రతి గ్రామానికి పక్క బీటీ రోడ్డు నిర్మాణం చేయిస్తానన్నారు. అందుకు అధికారులు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల నియోజకవర్గంలోని ఏడు మండలాల పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ డీఈలు, ఏఈలు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

చండూరు : చండూరు మున్సిపల్ కేంద్రంలో చేపట్టిన డబుల్ రోడ్డు పనులను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శనివారం పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును పరిశీలించి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో పలువురు అధికారులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెస్ ఛార్జీలు పెంచినా..

మర్రిగూడ : ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని మెస్ ఛార్జీలు పెంచినప్పటికీ విద్యార్థులకు మాత్రం నాణ్యమైన భోజనం అందడం లేదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను, జూనియర్ కళాశాల వసతిగృహాన్ని తనిఖీ చేసి డార్మిటరీ హాల్, డైనింగ్‌హాల్, వంటగది, మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లను పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందుతుందా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులు, ఆట స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించి రూ.1.25కోట్లతో నిర్మితమవుతున్న తొమ్మిది నూతన తరగతి గదులను, 30కి పైగా బాత్‌రూమ్‌లను, మరుగుదొడ్లను, మురుగునీటి వ్యవస్థను పరిశీలించి పాఠశాల ఆవరణలో ఉన్న విద్యుత్ స్థంబాలను, తీగలను తొలగించాలని విద్యుత్ అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. అదేవిధంగా మండల కేంద్రంలో ప్రభుత్వ భూములను సర్వే చేయించి ఆక్రమణకు గురికాకుండా చూడాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్‌యాదవ్, మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్, వెన్నమనేని రవీందర్‌రావు, మాజీ జెడ్పీటీసీలు మేతరి యాదయ్య, పాశం సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య విషయంలో జాగ్రత్తగా ఉండాలి

ప్రజలు ఆరోగ్య విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా కంటి విషయంలో ఇంకా జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఖుదాబాక్షపల్లి గ్రామంలో పాశం ధర్మారెడ్డి /జ్ఞాపకార్థంగా కుమారుడు పాశం కిరణ్‌కుమార్‌రెడ్డి శంకర్ నేత్రాలయ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.

యూరియా కోసం రైతుల తిప్పలు


కట్టంగూర్ : రైతువేదిక వద్ద యూరియా కోసం బారులుదీరిన రైతులు

శాలిగౌరారం: మండలకేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రానికి శనివారం 20 టన్నులు(444 బస్తాలు) యూరియా రానున్న విషయం తెలుసుకున్న రైతులు తెల్లవారుజామునుండే సుమారు 300మంది క్యూలైన్ కట్టారు. ఈ విషయం తెలుసుకున్న మండల వ్యవసాయ అధికారి సౌమ్యశృతి సిబ్బందితో ఉదయం 7.30 గంటలకే ఆగ్రో రైతుసేవా కేంద్రానికి చేరుకొని రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియాను అందించారు. యూరియా కోసం రోేదులు రాసేక్రమంలో రైతులు ఎగబడటంతో తోపులాట జరిగింది. దీంతో 222 మంది రైతులకు అందించారు.

ఆధార్ కార్డుకు రెండు బస్తాలు

కట్టంగూర్ : మండలకేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయ గోదాంకు శనివారం 888 బస్తాల యూరియా వచ్చింది. సమాచారం తెలుసుకున్న రైతులు ఎక్కువ సంఖ్యలో రావడంతో పీఏసీఎస్ వద్ద కాకుండా అధికారులు రైతు వేదిక వద్ద టోకెన్లు ఇచ్చి పీఏసీఎస్ వద్ద యూరియా బస్తాలను రైతుకు రెండు చొప్పున పంపిణీ చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం

చిట్యాల : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించడంతో పాటు ప్రమాద బీమాను పెంచినందుకుగాను హర్షం వ్యక్తం చేస్తూ చిట్యాలలో శనివారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకను నిర్వహించారు. ఆ సంఘం అధ్యక్షుడు పాల నర్సింహ్మా, కార్యదర్శి మంచాల గణేష్, కోశాధికారి విజయ్, బాలక్రిష్ణ, రాజలింగయ్య, క్రిష్టయ్య పాల్గొన్నారు.


సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న కార్మికులు

జర్నలిస్టులకు సన్మానం


నకిరేకల్ : జర్నలిస్టులను సన్మానిస్తున్న వాసవి, వనిత, కపుల్స్ క్లబ్ సభ్యులు

రామగిరి (నల్లగొండ): కేసీ గుప్త జయంతి వాసవి వారోత్సవాల సందర్భంగా శనివారం వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్ కపుల్స్ నల్లగొండ ఆధ్వర్యంలో జాతీయ గోల్డ్ మెడల్ అవార్డు గ్రహీత సాక్షి సీనియర్ ఫొటో జర్నలిస్టు కంది భజరంగ్ ప్రసాద్, జర్నలిస్టులు కోటగిరి రామకృష్ణ, సోమచంద్రశేఖర్ , రవి, మధు, దండంపల్లి రవిలను శాలువాలతో సన్మానించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధికారులు డీపీఓ గోపికృష్ణ, కొమినిశెట్టి రమాదేవి, జోన్ చైర్మన్ గజవెల్లి సత్తయ్య, జోన్ 2 రీజియన్ 3 డిస్ట్రిక్ట్ 104ఏ వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్ నల్లగొండ అధ్యక్షుడు గజవెల్లి ప్రసన్న, కార్యదర్శి వనమా పద్మ, కోశాధికారి ఉప్పల నాగలక్ష్మి, పూర్వ అధ్యక్షుడు వనమా లక్ష్మయ్య, మురారిసెట్టి కృష్ణయ్య, కలకొండ పెంటయ్య , సింగిరి కొండ గోవర్ధన్, వనమా మనోహర్, క్లబ్ సభ్యులు, సోమచంద్రశేఖర్ , ఇడుకులా నరసింహ, బండారు సురేష్ కుమార్ పాల్గొన్నారు.

నకిరేకల్ : వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రసేన గుప్తా జయంతి ఉత్సవాల్లో భాగంగా నకిరేకల్‌లో వైశ్యభవన్‌లో వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ డే సందర్భంగా శనివారం స్థానిక ప్రింట్ మీడియా జర్నలిస్ట్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ క్లబ్ జోన్ చైర్మన్ గుండా నరేందర్, ఆయా క్లబ్‌ల అధ్యక్షుడు గుడిపాటి రవి, తేలుకుంట్ల రాజు, కందగట్ల శ్వేత, చార్టెటెడ్ ప్రెసిండెంట్లు గుండా గోపి, కోటగిరి శ్రీనివాస్, మాజీ జోన్ చైర్మన్ సోమా అశోక్, కోశాధికారి బ్రహ్మదేవర వేణు, ప్రతినిధులు సోమ రమేశ్, కందగట్ల బాలాజీ, రేపాల పరిమళ, పబ్బతి స్వాతి, వీర్ల పాటి దయాకర్, వీర్లపాటి అంతయ్య, రాచకొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర


నాంపల్లి : శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


కనగల్ : గణేశ్ శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు


నకిరేకల్ : రంగారెడ్డి నగర్‌లో..


మర్రిగూడ : రాంరెడ్డిపల్లిలో..


తిప్పర్తి : శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు


కేతేపల్లి : భీమారంలో..